క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: వడ్డెపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని స్నేహనగర్ ఫీడర్‌లో మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 4.30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని హనుమకొండ డీఈ సాంబరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని భవానీ నగర్, స్నేహనగర్, మసీదు, హనుమాన్ టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్‌కు చెందిన పలు ప్రాంతాలకు సోమవారం తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల మరమ్మతుల కారణంగా కొత్తవాడ, రంగంపేట, శ్రీనివాస కాలనీ, పోతన నగర్, రాజీవ్ కాలనీ, పాపయ్య పేట, రామన్నపేట, తీగల గుట్ట, గాయత్రి కాలనీ, వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, దత్తాక్షేత్రం ప్రాంతం, రఘునాథ కాలనీ, ఓఎస్ నగర్, పాలిక్ మహేలా, షేర్‌పుర, ఎల్లంబజార్, బీట్ బజార్ తదితర ప్రాంతాల్లో ఒక రోజు నీటి సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

రేపు విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సమావేశం

హన్మకొండ: ఈ నెల 22న తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య, ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో జరగనున్న సమావేశానికి మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నయింనగర్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నికను ఎన్నికల పరిశీలకులు డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్, బి.అశోక్‌కుమార్, హనుమంతరావు సమక్షంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల శంకరయ్య, ఉపాధ్యక్షులుగా రావుల ఉదయధీర్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామోజు భిక్షపతి, కార్యదర్శులు రమేష్‌కుమార్, వేణుగోపాల్, వాసుదేవరెడ్డి, కోశాధికారిగా నూకల మధుసూదన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



హసన్‌పర్తి: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మడిపల్లి గ్రామశాఖ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారికే అవకాశం కల్పిస్తామన్నారు. అందరు కలిసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ గ్రామశాఖ ఎన్నిక

బీఆర్ఎస్ మడిపల్లి శాఖ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముంజ రామ్, ఉపాధ్యక్షుడిగా ఇలాసరపు కుమార్, రంజిత్, ప్రధాన కార్యదర్శులుగా ముంజ సునీల్, జక్కుల శ్రవణ్, కోఆర్డినేటర్లుగా మహ్మద్ ఆసిఫ్, సంద్ర కమలాకర్, కోశాధికారిగా మాచర్ల సునీల్, కార్యవర్గ సభ్యులుగా సుమన్, నితీష్, రంజిత్, రాజేందర్, సాయి, వంశీ, మనోజ్ ఎన్నికయ్యారు. సోషల్ మీడియా అధ్యక్షుడిగా బుర్ర మహేష్, ఉపాధ్యక్షులుగా జంపాల సాయిరాం, ఎండీ.అప్సర్, ప్రధాన కార్యదర్శిగా కుమార్, కార్యదర్శిగా చిర్ర ఆదిత్య, జనగాని మహేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, రైతు బంధు సమితి జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు సంగాల విక్టర్ బాబు పాల్గొన్నారు.

సరిపడా యూరియా అందించాలి

వరంగల్ చౌరస్తా: రైతులకు ప్రస్తుత తక్షణ అవసరాలకు సరిపడా యూరియాను ప్రభుత్వం పంపిణీ చేయాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రతినిధులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రితో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి, నాయకులు వస్కుల మట్టయ్య, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, గోనె కుమారస్వామి భేటీ అయ్యారు.

అధ్వానంగా రోడ్లు, డ్రెయినేజీలు



ప్రమాదకరంగా మారిన డీజిల్‌కాలనీ జంక్షన్



ఇసుక, కంకర తేలి ఉన్న రోడ్డు

జాతీయ రహదారిపై గుంతలు

- డీజిల్‌కాలనీ కూడలిలో ధ్వంసమైన రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కాజీపేట రూరల్: జాతీయ రహదారిపై కాజీపేట డీజిల్‌కాలనీ జంక్షన్‌లో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో వర్షపు నీరు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే, కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్‌కు రైల్వే ఉద్యోగులు, కార్మికులు రోజూ విధులకు వెళ్లి వస్తుంటారు. సమీపంలోని ఇంపీరియల్ కాలనీవాసులు కాజీపేట, హనుమకొండకు ఈ దారిలోనే పయనిస్తుంటారు. వరంగల్‌కు వెళ్లే మార్గంలో కొద్ది మేర రోడ్డు ఇసుక, కంకర తేలి అధ్వానంగా తయారవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలు పెద్దగా ఏర్పడి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కూడలిలో గుంతలను చూసి ముందున్న వాహనదారులు ఆకస్మాత్తుగా ఆగుతుండగా, వెనుక వచ్చే వాహనదారులు ఢీ కొడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జాతీయ రహదారిపై మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపై మరమ్మతులు చేయాలి



జాతీయ రహదారిపై డీజిల్‌కాలనీ కూడలిలో రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ క్రమంలో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల్లో వరద నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, పాలకులు చొరవ చూపి మరమ్మతులు చేపట్టాలి. **- ఎస్‌కే.జానీమియా, స్థానికుడు**

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

- 46వ డివిజన్‌లో రోడ్లపైకి చేరుతున్న మురుగునీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



మడికొండ మెట్టుగుట్ట ఆర్చి సమీపంలో కాల్వలో నిలిచిన మురుగు నీరు



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మడికొండ రహదారికి పక్కన ఉన్న మురుగునీటి కాలువలు సరిగా లేకపోవడంతో మురుగంతా రోడ్లపైకి చేరుతోంది. దాంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు పాదచారులపై పడి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. డ్రెయినేజీ సమస్యలను మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థాలను తొలగించి మున్సిపల్ సిబ్బంది ఊరుకుంటున్నారని వాపోతున్నారు.

వరద వస్తే ఇంట్లోకి మురుగునీరు



వర్షం వచ్చినప్పుడు మురుగు నీరు సరాసరి ఇంట్లోకే వస్తోంది. సైడు కాలువలు సరిగా లేకపోవడంతో మురుగు నిలిచి దుర్గంధం వస్తోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా దోమలతో ఇబ్బందిగా పడుతున్నాం. అపరిశుభ్ర వాతావరణంలో వర్షాకాలంలో జ్వరాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు స్పందించి మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించి, ఫాగింగ్ చేయించాలి.

- శ్రీనివాస్, స్థానికుడు

నీరు నిల్వకుండా చూడాలి



డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. సైడ్ కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరు నిలుస్తోంది. దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నీరు నిలవడం ద్వారా దుర్వాసన వస్తోంది. తరుచుగా డ్రెయినేజీల్లోని చెత్తాచెదారం, వ్యర్థాలు, బండరాళ్లను తొలగించాలి. దోమలు నివారణకు చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా అధికారులు, పాలకులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- రమేష్, స్థానికుడు

పెన్షనర్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కాజీపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి తెలిపారు. హనుమకొండలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించగా సంఘం కార్యదర్శులు సయ్యద్ ఖాజా మొయినొద్దీన్, సీహెచ్.సూర్యప్రకాష్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికకు ఎన్నికల అధికారిగా పెంటయ్య వ్యవహరించగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. 2025 – 28 ఏడాదికిగాను జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఇ.నర్సింహారెడ్డి, సహాధ్యక్షుడిగా ఎం.ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా సమ్మారెడ్డి, కోశాధికారిగా సీహెచ్.సూర్యప్రకాష్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'చిమ్నీల వెలుగులు' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కాజీపేట: శనిగరపు రాజ్‌మోహన్ రచించిన చిమ్నీల వెలుగులు అనే పుస్తకాన్ని కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని నారాయణ కళాశాలలో కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ మేరకు రచయిత రాజ్‌మోహన్‌ను వక్తలు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్, డాక్టర్ మంథని శంకర్, పొట్లపలి శ్రీనివాస్ రావు, అయినవోలు రాధాకృష్ణ, గుండారపు రవీందర్, సాహితీ ప్రియులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

'ఏకలవ్య' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

హన్మకొండ చౌరస్తా: రాష్ట్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏకలవ్య మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, సిబ్బందిని కాంట్రాక్ట్ సిబ్బందిగా మార్చాలని సూచించారు. గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ, 12 నెలల వేతనం అందించాలని కోరారు. గతంలో చెల్లించినట్లుగా నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని తెలిపారు. అకారణంగా ఉద్యోగులను తొలగించకూడదని, ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షఫీ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అకాడమీ నిర్వాహకులు

విద్యారణ్యపురి: క్రీడాపోటీల్లో గెలుపోటములను సాధారణంగా తీసుకుని, ఆత్మవిశ్వాసంతో క్రీడాకారులు ముందుకెళ్లాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం అధికారి, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ట్రైనర్ అండ్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్ సూచించారు. క్రీడాకారులు రాణించడం ఎలా అనే అంశంపై హనుమకొండ వడ్డేపల్లిలోని ఎస్‌పీ క్రికెట్ అకాడమీలో ఆయన మాట్లాడారు. ఆటల్లో ఓటమి చెందితే కుంగిపోవద్దని, మళ్లీ గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. క్రికెట్ టీమ్ గేమ్ అని, జట్టు సభ్యులందరూ ఆట స్ఫూర్తిని కొనసాగించాలని చెప్పారు. క్రికెట్ ఆటగాడిగా ఎలా ఎదగాలో ఈ సందర్భంగా క్రీడాకారులకు వివరించారు. సమావేశంలో ఎస్‌పీ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు రాజ్‌కుమార్, రవి, రమేష్, రవిశంకర్, సురేష్, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం గంగిశెట్టి శ్రీనివాస్‌ను నిర్వాహకులు సన్మానించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీదేవి

విద్యారణ్యపురి: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి అన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేయూ సమీపంలోని హనుమాన్‌నగర్‌లో మహిళా సంఘాల సభ్యులకు సఖి సెంటర్ సేవలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళలు, బాలికలకు ఐదు రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత కౌన్సెలింగ్, న్యాయ, వైద్య, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. సఖి సెంటర్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని అన్నారు. బాధిత మహిళలు హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్‌లైన్ నంబర్ 1098లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సఖి కేసు వర్కర్ అనూష, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఆస్తుల పరిరక్షణకు ఒకరోజు దీక్ష



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న క్రైస్తవ మత పెద్దలు

హన్మకొండ చౌరస్తా: మిషన్ ఆస్పత్రి, చర్చి ఆస్తుల పరిరక్షణకు హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి ఆవరణలో ఆదివారం దీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 నుంచి 3.30 గంటల వరకు జరిగిన దీక్షలో వివిధ గ్రామాల చర్చిలకు చెందిన సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీబీసీ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి స్వరూప్ మాట్లాడుతూ 145 ఏళ్ల చరిత్ర కలిగిన మిషన్, సీబీసీ భూములను అన్యాక్రాంతం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మిషన్ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీబీసీ సెక్రటరీ డాక్టర్ క్రిస్టఫర్ రూబెన్, ఉపాధ్యక్షుడు నల్ల జాన్సన్‌ప్రసాద్, బిషప్ మార్టిన్ లూథర్, గద్దం ప్రతాప్, మార్క్‌పీటర్, గద్దం జాన్, మత్తాయి, సీహెచ్ ఏలియా, సింగారపు రాజు, అహరోన్ రాజ్ కుమార్, ప్రేమ్‌కుమార్, ఫిలిప్, నేతనియేలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. హనుమకొండ సుబేదారిలోని కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఐఓ ఆధ్వర్యంలో సర్వే చేపట్టగా వరంగల్ నగరంలోని 14పైగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తక్కువ శాతం మూత్రశాలలు, అరకొరగా తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యం, ఇతర ప్రాథమిక వసతులు లేనట్లు సర్వేలో వెల్లడైనట్లు తెలిపారు. సర్వే వివరాల నివేదికను వరంగల్ కలెక్టర్ సత్యశారద, డీఈఓ జ్ఞానేశ్వర్‌కు అందజేసినట్లు వారు వివరించారు. సమావేశంలో తెలంగాణ క్యాంపస్ కార్యదర్శి మహ్మద్ తాజ్, వరంగల్ నగర అధ్యక్షుడు జక్రియా సోహెల్, నగర కార్యదర్శి హసీబ్ మనాన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

కాజీపేట రూరల్: కాజీపేట మండలం అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్టీ) రాష్ట్ర కార్యదర్శి జెరిపోతుల విల్సన్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొక్కల వెంకటస్వామి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ఆశీర్వాదం మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభను విజయవంతం చేయండి



సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు

నయింనగర్: ఈ నెల 22న హైదరాబాద్ గన్‌పార్క్‌లో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ ఓడపల్లి శ్యామ్‌కృష్ణ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్నా కార్యక్రమానికి ఉద్యమకారులు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కందగట్ల మోహన్, కన్వీనర్ అనుముల రమేష్, కందకట్ల జయ, సోమ మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మడికొండ: కాజీపేట మండలం మడికొండలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005 – 2006వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కరిష్మా గార్డెన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రెండు దశాబ్దాల తర్వాత వారంతా ఒకచోట చేరి అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోగి మధు, గున్నాల గౌతమ్, మాచర్ల విజయ్, కుమార్, పున్నంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే ఇవ్వాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు

ఖిలా వరంగల్: రిటైర్మెంట్ ఉద్యోగులకు పెన్షనర్స్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం తక్షణమే ఇవ్వాలని పెన్షనర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సదానందం డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని వందన హైస్కూల్ ప్రాంగణంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ వర్ధన్నపేట, శివనగర్ యూనిట్ ప్రధాన కార్యదర్శి సాంబారి సదానందం అధ్యక్షతన పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, నగదు రహిత చికిత్స విధానం, 2023, జూలై నుంచి పీఆర్సీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని సూచించారు. అనంతరం 2025 – 2028వ సంవత్సరానికి పెన్షనర్స్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొదురుపాక జయసేన, అధ్యక్షుడిగా మచ్చ యాకయ్య, ఉపాధ్యక్షులుగా పెద్దురి పెద్దయ్య, బత్తుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సాంబారి సదానందం, ఆర్థిక కార్యదర్శిగా వేసాల జగతయ్య, కార్యదర్శులుగా సాయిని కమారస్వామి, బేరశంకర్, అంబటి నర్సయ్య, జె.పద్మ, సలహాదారులుగా వడిచెర్ల సోమదాసు, గుండు కామేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి మాదర్ సాహెబ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

శరీర, అవయవ దానంపై అవగాహన



సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు

న్యూశాయంపేట: నేత్ర, శరీర, అవయవ దానంపై అందరూ ముందుకు రావాలని పలువురు వక్తలు సూచించారు. హనుమకొండ సుబేదారి ఫారెస్ట్ కార్యాలయ సమావేశ మందిరంలో రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో దంత వైద్యులు, మానసిక వైద్యులు పాల్గొని పలు సమస్యలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. నేత్ర, శరీర అవయవ దానంపై సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి. శ్రవణ్ కుమార్ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి అపోహలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ సీసీఎఫ్ అక్బర్, కొత్తగూడెం డీఎఫ్ఓ కృష్ణమాచారి, కిష్టాగౌడ్, సదాశయ ఫౌండేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ దళపతి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రహమత్ అలీషా ఉర్సు



దర్గా వద్ద ముతావలీ, చైర్మన్, కమిటీ సభ్యులు

న్యూశాయంపేట: హనుమకొండ మిషన్ ఆస్పత్రి సమీపంలోని హజ్రత్ సయ్యద్ సిద్దిఖీ బాషా, హజ్రత్ సయ్యద్ రహమత్ అలీ షా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 22, 23వ తేదీల్లో రెండు రోజుల పాటు జరుగుతాయని దర్గా ముతావలీ ఖాదీం మహ్మద్ ఖలీల్ అలీషా ఖలందర్, చైర్మన్, రాష్ట్ర పౌర సమాచార శాఖ రిటైర్డ్ సంయుక్త డైరెక్టర్ మహ్మద్ అలీ ముర్తుజా తెలిపారు. దర్గా ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం అసర్ నమాజ్ అనంతరం గుసూల్ షరీఫ్, ఇషా నమాజ్ తర్వాత సందల్ ఊరేగింపు హజ్రత్ సయ్యద్ అబ్దుల్ నబీషా దర్గా నుంచి ప్రారంభం అవుతుందని చెప్పారు. బుధవారం ఉర్సు ప్రధాన కార్యక్రమంలో భాగంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు, ఖవ్వాలి, ప్రత్యేక ప్రార్థనలు, లంగర్ (అన్నదానం), మహనుభావుల జీవిత విశేషాలు, సందేశం, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తారని వివరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఆసిఫ్ రహ్మాన్, హబీబ్ రహ్మాన్, అబ్దుల్ జాకీర్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.